# సూర్య ఆదివారం

www.suryaa.com

16.2.2025


# మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2025



## నవ కవిత్వం

### నాన్న నేనే అని చెప్పాలని.



ఆలోచనలన్నీ రంగరించి
అంతరంగాల రంగులు పులిమి
ఊహాజనిత రేఖలతో
రూపు దిద్దిన బొమ్మ!

చూస్తూ పరవశిస్తూ
మురిసిపోతూ, మైమరచిపోతూ
ఆ బొమ్మకు అమ్మ ఎవరు
ప్రశ్నోదయంతో ప్రేక్షకుడు!

నాన్న నేనే అని చెప్పాలని
చెప్పలేక మౌనంగా...
పెదవులపై మందహాసంతో
సృష్టికర్త!

**జగ్గయ్య.జి**
**9849525802**

## లేఖలు




**ముఖచిత్ర కథనం**

**ఈ వారం లైలా మజ్నూ ల గురించి విపులంగా మంచి వ్యాసం ప్రచురించడం బాగుంది. ప్రేమికుల రోజున సందర్భాను సారం ఈ రచన ప్రచురణ బాగుంది.** అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుంది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## నీ అందం



గుండెను గుచ్చి
గుబులుపుట్టిస్తుంది నీ అందం
సయ్యాటలు ఆడమని
సరసాలాడుతుంది నీ అందం

మరులు కొలిపి
మత్తెక్కిస్తుంది నీ అందం
బుట్టలో వేసుకొని
మాయచేస్తుంది నీ అందం

పరాయిపాలు చేయవద్దని
కాచుకోమంటుంది నీ అందం
ఎన్నడూ మరచిపోవద్దని
కలలోకొస్తుంది నీ అందం

అవకాశం సద్వినియోగంచేసుకొని
చేబట్టమంటుంది నీ అందం
తోడుగా నిలుచుండిపొమ్మని
పిలుస్తుంది నీ అందం

జాగుచేయకుండా జల్ది
ప్రేమించమంటుంది నీ అందం
పెద్దలముందు పరిణయమాడి
శాశ్వతంచేసుకోమంటుంది నీ అందం

వినూత్నతనంగా తలచి
వర్ణించమంటుంది నీ అందం
విశిష్టకవిగా మారి
వెలిగిపోమ్మంటుంది నీ అందం


చూచింది చూచినరీతి
పొగడమంటుంది నీ అందం
కవితను కమ్మగాకూర్చమని
కవ్విస్తుంది నీ అందం


చేతులు చాచి
స్వాగతిస్తుంది నీ అందం
మనసును తట్టి
సంతసపరుస్తుంది నీ అందం


కళ్ళను పెద్దవిచేసి
కనమంటుంది నీ అందం
చూపును కట్టిపడవేసి
బంధిస్తుంది నీ అందం

తీరేదాక దప్పి
ఆస్వాదించమంటుంది నీ అందం
నిండేవరకు హృది
నిలుపుకోమంటుంది నీ అందం

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
**9177915285**




# సూర్య బుడత

**బాలల కథ**



## ఊహించని మంచు తుఫాను



ఒకానొకరోజు, రాము అనే వ్యక్తి కొండల్లో ట్రెక్కింగ్కి వెళ్ళాడు.పర్వతాలలో హైకింగ్ చేస్తున్న రాము . అకస్మాత్తుగా వచ్చిన మంచు తుఫానులో, దారి తప్పి, త్వరగా తన మార్గాన్ని కోల్పోయాడు. ఎటు వెళ్లాలో తెలియక, అతను చాలా భయపడ్డాడు. మంచు పెరుగుతుండటంతో, అతని చేతులు, కాళ్లు కొద్దిగా గడ్డ కట్టుకు పోతున్నాయి. అతను త్వరగా ఆశ్రయం పొందాలని, లేకుంటే అతను చలికి చనిపోతాడని అతనికి తెలుసు. అతను ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, అతని చేతులు మరియు కాళ్ళు త్వరగా మొద్దుబారిపోయాయి. అలా అయోమయంలో ఉండగా, అతను తప్పుకోకుండా నడుస్తూ వెళ్ళి, ఓ వ్యక్తిని తడబడి పడి వెనక్కి తూలిపోయాడు. చూస్తే, ఆ వ్యక్తి పూర్తిగా మంచులో పడి పోయి, ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. రాము అప్పుడు ఓ పెద్ద నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది – తన ప్రాణాల్ని కాపాడుకోవడానికి ఒక్కడిగా వెళ్లాలా? లేక ఆ వ్యక్తిని సహాయపడాలా?

ఒక క్షణం కూడా ఆలోచించకుండా, రాము ఒక నిర్ణయం తీసుకుని, తన తడి గ్లోవ్స్ను తీసేసి, ఆ వ్యక్తి చేతులు, కాళ్లు ఖులంగా రుద్దడం ప్రారంభించాడు. కొద్దిసేపటికి, ఆ వ్యక్తి కాస్త కదులుతుండటం మొదలుపెట్టాడు. కొద్దిసేపటికి అతను పూర్తిగా చలనం పొందాడు. ఇద్దరూ పరస్పరం ఒకరిని ఒకరు అండగా చేసుకుంటూ, బయటకు వచ్చారు


క్షణంలో అతను ఒక నిర్ణయం తీసుకుని తన తడి చేతి తొడుగులు విసిరివేసాడు. అతను ఆ వ్యక్తి పక్కన మోకరిల్లి అతని చేతులు మరియు కాళ్ళకు మసాజ్ చేయడం ప్రారంభించాడు. హైకర్ రాము కొన్ని నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత, కొద్దిసేపటికి, ఆ వ్యక్తి కాస్త కదులుతుండటం మొదలుపెట్టాడు మరియు త్వరలోనే తన కాళ్ళపై నిలబడగలిగాడు. ఇద్దరు వ్యక్తులు కలిసి, ఒకరినొకరు ఆసరాగా చేసుకుని, సహాయం పొందారు. తర్వాత, రాముని ఆశ్చర్యానికి, తన చేతులు, కాళ్లలో కదలిక తిరిగి వచ్చిందని గ్రహించాడు. అతను మరొకరిని కాపాడే ప్రయత్నంలో తనకే సాయం చేసుకున్నాడు!. రాము ఆ అపరిచితుడి చేతులు మరియు కాళ్ళకు మసాజ్ చేస్తున్నప్పుడు రాము తిమ్మిరి మాయమైంది.


కారణం– అతని పెరిగిన కార్యాచరణ అతని రక్త ప్రసరణను మెరుగుపరిచింది మరియు అతని చేతులు మరియు కాళ్ళకు వెచ్చదనాన్ని తెచ్చిపెట్టింది.


ఇది విడ్డూరంగా ఉంది కానీ ఆశ్చర్యం కలిగించదు, హైకర్ రాము తన కష్టాన్ని మర్చిపోయి సహాయం చేయడం మరియు వేరొకరిపై దృష్టి పెట్టినప్పుడు, అతను తన జీవిత సమస్యను తానే పరిష్కరించుకున్నాడు


నీతి: మనము ఇతరులకు సహాయం చేస్తే, అది మనకే ఉపకరిస్తుంది. సహాయం అనేది మనల్ని మరింత బలంగా, మంచిగా మారుస్తుంది!

**–మండా వెంకట అప్పారావు ( 9347589272)**





# " దండం దశ గుణం భవేత్ "



బ దండము అనే పదానికి నమస్కార ము, కర్ర , చతుర్విధ ఉపాయాలలో ఒకటి, శిక్ష అనే అర్థాలున్నాయి. "దండం దశ గుణం భవేత్ " అనే వాక్యానికి దండం వలన పదిరెట్ల ప్ర యోజనం ఉంటుందని అని అర్థం. అది ఎలాగో చూద్దాం.

దండం అంటే నమస్కారం అని ఒక అర్థం. పెద్దలకు, గురువులకు, దేవునికి నమస్కారం పెట్టడం వలన వారికి మనపట్ల ప్రసన్నత కలిగి మనం వారి నుండి ఆశించిన ప్రయోజనం తప్పక నెరవేరుతుంది. దేవతలకు, గురువుల కు సాష్టాంగ దండ ప్రణామం చేస్తారు. అంటే నేలమీద దండము (కర్ర) లాగా శరీరాన్ని వాల్చి, కాళ్ళు చేతులనుచాపి అష్టాంగములతో నమస్కరించడం. ఇందులో ఉరసా (తొడల భాగం), శిరసా (తల భాగం), దృష్ట్యా (కళ్ళ భాగం), మనసా (హృద య భాగం), వచసా (నోటి భాగం), పద్భ్యాం (పాదముల భాగం), కరా భ్యాం (చేతుల భాగం), కర్ణాభ్యాం (చెవుల భాగం) అనే 8 శరీరాంగములను నేలకు తాకించి నమస్కరించడం చేస్తారు. సామాన్యంగా ఈ 8 శరీరాంగములతోనే మానవుల మైన మనం తప్పులు చేస్తూంటాము. ఆ తప్పులను కాయమని వేడుకోవడం ఈ దండ ప్రణామ ఆంతర్యం. స్త్రీలు సాష్టాంగ దండ ప్రణామం చేయకూడ దు. వాళ్ళు కాళ్ళు, చేతులు, నుదురు మాత్రమే నేలకు తాకేలా పంచాంగ నమస్కారం చేయాలని శాస్త్రం చెబు తుంది. ఇదికాక చేతులు జోడించి అం జలి ఘటించడం, తలను కొద్దిగా వంచి కళ్ళను మూసి తెరవడం ద్వారా నేత్ర వందనం ఆచరించడం కూడా ఎదుటి వారిలో గల పరమాత్మను గుర్తించి గౌర వించడానికి, మన వినయ విధేయతల ను తెలియజేయడానికి, మన నిరహం కార ప్రవృత్తికి నిదర్శనాలుగా నిలిచి మన కార్య సాఫల్యతకు పలు రకాలుగా తోడ్పడతా యి.

సామ, దాన, భేద, దండోపాయాల లో చివరి ఉపాయము దండము. మం చి మాటల ద్వారా, చేతల ద్వారా, కా ర్య సాధనము సామము : కానుకలను ఆశ చూపి కార్య సాధన కావించడము దానము బీ ఇతరులతో పోల్చి చూపు తూ పౌరుషాన్ని రేకెత్తించి పని పూర్తి చేయడం భేదము బీ ఈ మూడు ఉపా యాలూ క్రమంగా విఫలమైనప్పుడు చివరన ప్రయోగించాల్సిన ఉపాయ ము దండోపాయము. అంటే దండించ డము (మందలించడం) , కొట్టడం, శిక్షించడం లేదా యుద్ధం చేయడం ద్వా రా కార్యం సాధన చేసుకోవడం. ఇది చిట్ట చివరన ఉపయోగించాల్సిన ఉపా యం.

దుష్టులు, దుర్మార్గులు, దేశద్రోహు లు వంటి వారిని దండించడం రాజదం డం చేతబట్టిన రాజు, అధికారి, లేదా ప్రభుత్వం యొక్క కర్తవ్యం. చేసిన తప్పుకు దండించబడినప్పుడు ఆ తప్పు మళ్ళీ చేయరని నమ్మకం. "దం డాత్ ప్రతి భయం భూయః శాంతిరు త్పద్యతే తదా/ నోద్విగ్నశ్చరతే ధర్మం నోద్విగ్నశ్చరతే క్రియామ్ ". తప్పు చేసి న వారికి శిక్ష పడితే మళ్ళీ తప్పు చేయ డానికి వారు భయపడతారు. అలా త ప్పులను లేదా నేరాలను అరికట్టడం జరుగుతుంది. తద్వారా ప్రశాంతత నెలకొంటుందని విశ్వాసం. ప్రశాంతత లేకపోతే ఉద్విగ్నత నెలకొని ధర్మాచర ణ సాధ్యంకాదు. కనుక దుష్టులు దం డించబడాలని, అది పలురకాలుగా ప్ర యోజనకారి అని మహాభారతం ఆది పర్వంలో శమీకమహర్షి చెబుతాడు.

దండం అంటే బెత్తం. బెత్తంతో నా లుగు వడ్డిస్తే తప్పుచేసి శిక్షపడిన వాడి లో వినయ విధేయతలు, క్రమ శిక్షణ, భయభక్తులు, కర్తవ్య బాధ్యత నిర్వహ ణ వంటి పదిరకాల సుగుణాలు ఆ విర్భవించి అతడిని సజ్జనునిగా తీర్చి దిద్దుతాయని పెద్దల నమ్మకం. లోకం లో ఈ అర్థంలోనే చాలామంది "దండం దశగుణం భవేత్ " అనే వాక్యాన్ని వా డుతుంటారు.

సుమతీ శతక కర్త ఇలా ఆంటారు : " నయమున పాలును త్రాగరు/ భయ మునను విషమ్మునైన భక్షింతురుగా / నయమెంత మోసకారియొ/ భయమే చూపంగ వలయు బాలుర ఎడలన్ " .

వ్యక్తిత్వ వికాసం మొదలయ్యే బాల్య దశ లో దండించడం భయపెట్టడంతోనైనా సరే బా లురలో క్రమ శిక్షణ నెలకొనేలా చేయా లని ఈ పద్యం యొక్క భావం.

ఇక అసలు విషయానికొస్తే చేతికర్ర (దండం) పది రకాల ప్రయోజనాలను నెరవేరుస్తుంది. ( పది అనేది ఇక్కడ కే వలం సంఖ్యావాచకం కాదు. 'అనేక' అ నే అర్థంలో గ్రహించాలి). " విశ్వామిత్రా హి పశుషు కర్దమేషు జలేషుచ/ అంధ్యే , తమసి, వార్ధక్యే దండం దశ గుణం భవేత్ " . పక్షులను, కుక్కలను, శత్రువులను, పాములను, పశువులను కట్టడి చేయడానికి బీ బురదలో, నీటిలో జారకుండా నిలదొక్కుకోడానికిబీ గుడ్డి వారికి, చీకటిలో ఉన్నవారికి, ముసలివారికి ఆసరాగా వారు క్రిందపడిపోకుండా నడవడానికి – ఇలా చేతికర్ర అనేక విధాలుగా సహాయపడుతుంది.

అంతేకాదు. ఒక్కొక్క ఆశ్రమ ధర్మా న్ని అవలంబించే వారు ఒక్కొక్క రకమై న కర్రను వాడాలని కూడా మన శాస్త్రా లు చెబుతున్నాయి. బ్రహ్మచారులు మోదుగ కర్రను, గృహస్థులు ఊడుగ క ర్రను, సన్న్యాసులు వెదురు కర్రను ధరించాలట. ఉపనయనం తర్వాత వ టువుకు మోదుగ కర్రను అందిస్తారు. "ఆయుర్వర్చో యశో బలాభి వృధ్యర్థం, గో సర్ప భయ నివృత్యర్థం పాలాశ దండ ధారణం కరిష్యే " అంటూ మంత్రం ఆ సందర్భంలో పఠిస్తారు. అంటే బ్రహ్మ చారికి ఆయుష్షు, వర్చస్సు, యశస్సు, బలం పెరగడానికి, పశువులనుండి, సర్పాలనుండి కాపాడుకోడానికి మోదు గ కర్రను ధరింపజేస్తున్నాము అని ఈ మంత్రార్థం. మోదుగ శాస్త్రీయ నామం "బుటియా మోనోస్పెర్మా". దీని సంస్కృత నామం పాలాశం.

వ్యవసాయ ప్రధానమైన మన దేశం లో పొలాలలోని బురద నీటిలో నడవ డానికి, పశువుల, పక్షుల, పాములనుం డి కాపాడుకోడానికి చేతికర్ర చాలా అవసరం.అందులోనూ ఔషధ గుణా లున్న మోదుగ, ఊడుగ, వెదురు కర్రలు చేయూతతోబాటు ఆరోగ్యాన్ని కూడా అదనంగా చేకూరుస్తాయి. మోదుగ వి స్తళ్ళలో భోజనము చేస్తే 60 రకాల వ్యాధులు రావనీ, 60 ఏళ్ళ దాకా ఆరోగ్యంగా ఉంటారనీ, అంటే పరిపూర్ణమైన ఆయుష్షును పొందుతారనీ ఆయుర్వేద వైద్యులు అంటారు. ఏదో ఒక కారణంగా వృక్షాలను పెంచడం, సంరక్షించడం, వాటినుండి ప్రయోజనా లను పొందడం మన సంస్కృతిలో ఒక భాగం.

గృహస్థులు ఊడుగ కర్రను ఉప యోగించాలని శాస్త్రం చెబుతోంది. సంస్కృతంలో అంకోల వృక్షం అని పిలువబడే ఊడుగ చె ట్టు కాయలను తింటే పిల్లలకు జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ఊడుగ వేర్లు, కర్ర ల గంధంతో రక్త విరోచనాలు, పుండ్లు, కీళ్ళ నొప్పులుబీ పాము, కుక్క, ఎలుకల వంటి వాటి కాట్లు మొదలైన అనేక రకాల అనారో గ్యాలు అరికట్టబడతాయని ఆయుర్వే దం చెబుతోంది. ఊడుగ పూలను కం టి రెప్పలపై పెట్టుకోవడం వలన నేత్ర రోగాలు నయమౌతాయని చెబుతారు. గృహస్థులకు ఈ చెట్టు చాలా ఉపయో గ పడుతుంది. అందుకే వారికి ఈ అం కోల దండ ధారణను శాస్త్రం విధించిం ది. దీని శాస్త్రీయ నామం " అలంగి యం సాలిఫోలియం".

వెదురు మానసిక ప్రశాంతతను ప్ర సాదించే మొక్క. దీనివల్ల పరిసరాలలో ఆనందం, మానసిక ఉల్లాసం, సంతో షం, శుభం, అదృష్టం కలుగుతాయి. వె దురు గడలతో తాత్కాలిక గుడారాలు, ఆశ్రమాలు నిర్మించుకోవచ్చు. వెదురు బియ్యం మంచి ఆరోగ్యకరమైన ఆహా రం. ధృఢంగా ఉండే వెదురు కర్ర మనిషికి చక్కని ఊతకర్రగా పనికి వస్తుంది. దీని శాస్త్రీయ నామం "బాంబుసా". స న్న్యాసాశ్రమంలో సాధారణంగా నడి వయస్సు, ఆపై వయస్సు ఉన్న పెద్దవారే ఉం టారు. వారికి వెదురు కర్రను ఊతగా నిర్ణయించడంలోని ఆంతర్యమిదే.

" బ్రతికియున్న నాడు ఫలములి చ్చుటె కాదు/ చచ్చికూడ చీల్చి ఇచ్చు తనువు/ త్యాగ భావమునకు తరువు లే గురువులు " అన్నారు. తన ను నరికే గొడ్డలికి కూడా కర్రను ఇచ్చే త్యాగ గుణం చెట్లకే స్వంతం. పర్యావ రణ పరిరక్షణకు కూడా వృక్షాల సంరక్ష ణ చాలా అవసరం. చెట్లనుండి పండ్లు, పూలు, ఆకులు, కర్రలు, ఓషధులు వం టి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వా టి కర్ర (దండం) తో గృహోపకరణాల తయారీ మొదలుగా గల ప్రయోజనాలు లెక్క పెట్టలేనివి. అందుకే " దండం దశ గుణం భవేత్ ". చెట్లను పెంచేవారికి, సంరక్షించే వారికి వేనవేల " దండాలు".

**డా. గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి 94407 81236**

# ఒక్క హగ్‌తో అద్భుతమైన ప్రయోజనాలు..!

ప్రేమను వ్యక్తీకరించడానికి కౌగిలింత ఒక సున్నితమైన భావన మాత్రమే కాదు. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది అని మీకు తెలుసా..? శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం.. కేవలం 20 సెకన్ల పాటు కౌగిలించుకోవడం వల్ల మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందట. శరీరానికి ప్రశాంతతను అందిస్తుందని పరిశోధనలో తేలింది. మనం ప్రేమించే వారిని కౌగిలించుకోవడం వల్ల శరీరం, మనసుకు ఎంతో మేలు జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కేవలం 20 సెకన్ల పాటు కౌగిలించుకుంటేనే మానసిక ఒత్తిడి తగ్గిపోతుందని పరిశోధనల్లో వెల్లడైంది. దీనివల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఒత్తిడి, ఆందోళన తగ్గింపు**

ఈ రోజుల్లో పని ఒత్తిడి, భయాందోళనలు, మనసుకు శాంతి లేకపోవడం సహజమైపోయింది. కానీ కేవలం 20 సెకన్ల పాటు కౌగిలించుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. శరీరంలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదలై, మనసుకు ప్రశాంతతను అందిస్తుంది.

**మానసిక ఆరోగ్యం**

భాగస్వామిని లేదా మనకు ఇష్టమైన వ్యక్తిని కౌగిలించుకోవడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది నమ్మకాన్ని పెంచడమే కాకుండా గుండెకు కూడా ఎంతో మేలు చేస్తుంది. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం



కౌగిలింత వల్ల మనస్సు ప్రశాంతంగా మారి ఆనందాన్ని పెంచే హార్మోన్లు విడుదలవుతాయి.

**శారీరక నొప్పి నుండి రిలీఫ్** కౌగిలించుకోవడం కేవలం భావోద్వేగాలకే కాదు శరీరానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. శరీరంలో నొప్పిని తగ్గించే హార్మోన్లు కౌగిలింత ద్వారా ఉత్పత్తి అవుతాయి. కొన్ని చికిత్సల కన్నా ఇది ఎంతో సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

**గుండె ఆరోగ్యం** నార్త్ కరోలినా యూనివర్సిటీ చేసిన అధ్యయనం ప్రకారం.. కౌగిలించుకునే వ్యక్తుల గుండె స్పందన సరిగా ఉంటుందని తేలింది. కౌగిలించుకోవడం వల్ల రక్త పోటు నియంత్రితంగా ఉంటుంది. దీంతో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది.

**ఒత్తిడి ఎక్కువగా ఉంటే ప్రమాదం** అధ్యయనంలో పాల్గొన్న కౌగిలించుకోని జంటల గుండె స్పందన నిమిషానికి 10 బీట్స్ పెరిగిందని తేలింది. అంటే కౌగిలించుకోని వారి ఒత్తిడి స్థాయి ఎక్కువగా ఉంటుందని స్పష్టమైంది. అందువల్ల మనం ప్రేమించే వారిని కౌగిలించుకోవడం ద్వారా శరీరం, మనస్సుకు చాలా మేలు జరుగుతుంది. ప్రతిరోజూ మనకు ఇష్టమైన వారిని కౌగిలించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. చిన్న కౌగిలింత వల్ల జరిగే మేలు తెలియక చాలా మంది దీనిని నిర్లక్ష్యం చేస్తుంటారు.

సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి)

అయినా కనపడకపోయేసరికి పోలీసు స్టేషన్ లో కేసు పెట్టారు. గంగ రాజాతో కలిసి పులివెందులలో తిరిగేదని, ఇద్దరూ ప్రేమించుకున్నారని పోలీసుల దర్యాప్తులో తెలిసింది.

రాజాను విచారించారు, గంగను చూసి చాలా రోజులయ్యిందన్నాడు. అయినా రాజానే గంగను ఏమో చేశాడని పోలీసులు రాజాను చితకబాదారు. రాజా తండ్రి పోలీసులతో గొడవపడ్డాడు.

వెంకట్ రెడ్డే గంగను ఏమైనా చేసి ఉండవచ్చని పోలీసులకు చెప్పాడు. పోలీసులు వెంకట్ రెడ్డిని విచారించారు. పోలీసులకు డబ్బు ఇచ్చి గంగను రాజానే ఏమో చేశాడని కేసు పెట్టమని చెప్పాడు. పోలీసులు డబ్బులకు గడ్డి తిని అలానే చేశారు. దాంతో రాజా జైలుకు వెళ్లాడు.

రాజా గంగను చంపి ఉండవచ్చు లేదంటే ఎక్కడైనా దాచి పెట్టి ఉండవచ్చని గంగులుకు పోలీసులు చెప్పారు. గంగులు, అచ్చక్క గుండెలు బాదుకున్నారు. గంగ కనపడలేదని సుబ్బక్కకు తెలిసింది. సుబ్బక్క ఆరోగ్యం బాగాలేదు, పిచ్చి పట్టింది. కూతురిని పోగొట్టుకొని పిచ్చిదైన సుబ్బక్క మనవరాలు కనపడలేదని తెలిసి అల్లాడిపోయింది.

వారం రోజులు దాటినా గంగ ఆచూకీని పోలీసులు కనిపెట్టలేకపోయారు. రాజాకు బెయిల్ రావడంతో జైలు నుండి బయటకు వచ్చేశాడు. గంగులు రాజాను చంపేయడానికి ఇంటి మీదకు వెళ్లాడు.

రాజా, రాజా తండ్రి గంగులు కాళ్ల మీద పడ్డారు. గంగ, రాజా విడిపోయి చాలా రోజులయ్యిందని రాజా తండ్రి చెప్పాడు. వెంకట్ రెడ్డి, కొండారెడ్డిల మీద అనుమానాన్ని వ్యక్తపరిచాడు. గంగులు ఆవేశం కట్టలు తెంచుకుంది. నేరుగా వెంకట్ రెడ్డి ఇంటి మీద వెళ్లి గొడవ చేశాడు.

వెంకట్ రెడ్డి పోలీసులను పిలిపించి గంగులును అరెస్ట్ చేయించి, చచ్చేటట్లు కొట్టమని డబ్బు ఇచ్చాడు. గంగులును లాకప్ లో వేసి, రక్తం వచ్చేలా కొట్టారు. వెంకట్ రెడ్డి ఇంట్లో దొంగతనం చేశాడని తప్పుడు కేసు పెట్టారు. భర్తను జైల్లో వేయడంతో అచ్చక్క తట్టుకోలేకపోయింది.

డబ్బు, పలుకుబడి ఉంటే వ్యవస్థలను కొనడం, తప్పుడు కేసులను పెట్టడం, నేరాలు చేసి తప్పించుకోవడం నేటికి జరుగుతూనే ఉన్నాయి. పోలీస్ స్టేషన్ ల వరకు వస్తున్నవి కొన్నే, అందుకో కూడా చాలావరకు కోర్టు మెట్లు ఎక్కడం లేదు, కొందరు పోలీసులు ఎక్కనివ్వరు, ఎక్కనిస్తే ఎలా బతుకుతారు?

గంగను కొండారెడ్డి, వెంకట్ రెడ్డి కొట్టారు, తిట్టారు, కామవాంఛలను తీర్చుకున్నారు. గంగను హైదరాబాదుకు చెందిన ఒక కంపెనీకి అమ్మేయాలని నిర్ణయించారు. యాభై వేలకు బేరం కుదిరింది.

వదిలిపెట్టమని, జరిగిన విషయం ఎవరికీ చెప్పనని ఎంత బతిమిలాడినా కనికరించలేదు. కళ్లకు గంతలు కట్టి వాహనం ఎక్కించారు. డ్రైవర్ తప్ప అందరూ తాగే ఉన్నారు. గంగతో అసహ్యంగా ప్రవర్తించారు. బండిలో నుండి దూకి చనిపోవడం తప్ప వేరే మార్గం లేదని నిర్ణయించుకుంది.

సరిగ్గా మల్యాల దాటిన తర్వాత బండి కొండ ఎక్కుతున్న సమయంలో పాము పాము అని అరిచింది. డ్రైవర్ బండి ఆపాడు, అందరూ బండి దిగారు. గంగను బండిలోనే వదిలేశారు. కాపాడండి కాపాడండి అంటూ అరిచింది. గంగ అరుపులను పట్టించుకోలేదు, కాసేపటి తర్వాత ఒకతను వెళ్లి గంగ కాళ్లకు, చేతులకు కట్టిన తాళ్లు విప్పాడు.

అతడిని తన్ని మల్యాల లోయలోకి దూకేసింది. చీకటి, గుబురు గుబురు చెట్లు ఉండటంతో గంగను కనిపెట్టలేకపోయారు. అంత పైనుండి దూకితే బతకడం అసాధ్యం. బండి పులివెందులకు వెనుతిరిగింది.

@@@

పాపులమ్మ, ఆదెన్న మరణానికి కారణం కొండారెడ్డి, పెద్దకోటయ్య, స్వామేనని సుబ్బక్కకు తెలుసు. గంగులును జైల్లో వేశారని తెలిసి గుడిసె నుండి బయట పడింది.నన్నుచంపకండి, వదిలేయండని అరుస్తూ వేముల పల్లెలో పరిగెత్తింది.

పల్లె ప్రజలందరూ సుబ్బక్క వెనుక పరిగెత్తారు. సుబ్బక్క మిట్ట మీద ఉన్న కొండారెడ్డి ఇంటికి చేరుకుంది. కొండారెడ్డి ఇంట్లో ప్రశాంతంగా నిద్రపోతు న్నాడు. కొండారెడ్డి ఇంటి తలుపు బాదింది, సావిత్రి తలుపు తెరిచింది.

సుబ్బక్క చేతిలో కొడవలి చూసి సావిత్రి హడలిపోయింది. సుబ్బక్క ఒంటి మీద చీర లేదు. కేవలం లంగా, జాకెట్ మాత్రమే ఉన్నాయి. సుబ్బక్క నేరుగా కొండారెడ్డి గదిలోకి వెళ్లింది. మంచం మీద పడుకున్న కొండారెడ్డి గుండెల మీద మోకాలితో అదిమి పట్టుకొని గొంతు పట్టుకుంది.

కొండారెడ్డి ఇంట్లోకి దళితులు, బహుజనులు, బీదలు వెళ్లారు. సుబ్బక్క నుండి తప్పించుకోడానికి కొండారెడ్డి ప్రయత్నించాడు కానీ కుదరలేదు. అప్పటికే తల మీద కొడవలితో కోబలి కోబలి అంటూ బలమైన దెబ్బ కొట్టింది. కొండారెడ్డి నుదురు చిట్లింది, వదలమని ఏడ్చాడు.

పల్లె ప్రజలు చూస్తూ ఉండిపోయారు, ఎవరూ ఆపడానికి ముందుకు వెళ్లలేదు. కొండారెడ్డి గొంతు కోసింది, రక్తాన్ని ఇంట్లో వెదజల్లింది. సుబ్బక్క శరీరం మొత్తం కొండారెడ్డి రక్తంతో తడిసింది. అక్కడి నుండి కోబలి కోబలి అంటూ పరుగో పరుగు. సుబ్బక్క వెనుకే చాలామంది పరిగెత్తారు. బాపనోళ్ళ వీధిలో ఉన్న స్వామి ఇంట్లోకి దూరింది.

సుబ్బక్కను చూసి స్వామి పరిగెత్తాడు. వేటాడింది, స్వామి కట్టుకున్న పట్టు పంచె ఊడిపోయింది. ఇంట్లో నుండి బయటపడ్డాడు. సుబ్బక్క స్వామి వెనుకే పరిగెత్తింది, స్వామి దళిత వీధిలో ఉన్న ఒక గుడిసెలో దాక్కున్నాడు.

ఫలానా గుడిసెలో ఉన్నాడని ఎవరో సుబ్బక్కకు చెప్పారు. గుడిసెలోకి వెళ్లి స్వామి గొంతు కోసి కోబలి కోబలి అంటూ నవ్వుకుంటూ వంకగడ్డకు పరిగెత్తింది. సుబ్బక్క తర్వాత ఎవరిని చంపుతుందోనని వేముల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

కోబలి కోబలి అంటూ వంకలోకి దూకింది, నీటిలో కొట్టుకుపోయింది. మ- రుసటి రోజు శవమై తేలింది. పోలీసులు పల్లెకు వెళ్లి, ప్రజలను విచారించారు. సుబ్బక్కకు అమ్మవారు పూనిందని, కోబలి కోబలి అంటూ కొండారెడ్డి, స్వామిని చంపిందన్నారు.

అమ్మవారు కాదని, తన బిడ్డ పాపులమ్మ, అల్లుడు ఆదెన్న మరణాలకు కారణం కొండారెడ్డి, స్వామేనని సుబ్బక్క భావించింది. గంగ కూడా కనపడకపోవడంతో కొండారెడ్డే ఏమో చేశాడని నరికి చంపింది, సుబ్బక్క పిచ్చిదని మరెవరో చెప్పారు.

అన్నను సుబ్బక్క చంపడం, గంగ తప్పించుకుందని తెలిసి వెంకట్ రెడ్డి కోపంతో ఊగిపోయాడు. వేముల పల్లెకు వెళ్లి దారుణంగా హత్యకు గురైన కొండారెడ్డి శవాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. గంగ కుటుంబాన్ని లేకుండా చేయాలని, దాని కోసం ఏదో ఒకటి చేయాలనుకున్నాడు.

కొండారెడ్డి భార్య మంగమ్మ బాధపడలేదు, పీడ విరగడ అయ్యిందనుకుంది. మెడలో ఉన్న తాళిబొట్టు కొండారెడ్డి శవం మీద విసిరేసింది. గాజులు, మెట్టెలు, నుదుటి మీద బొట్టు మాత్రం తీయలేదు, తీయాల్సిన అవసరం లేదనుకుంది.

@@@

సుబ్బక్క కొండారెడ్డిని చంపాలని ఎప్పుడో నిర్ణయించుకుంది. పాపులమ్మతో అసభ్యంగా ప్రవర్తించాడని పాపులమ్మ చెప్పకపోయినా సుబ్బక్కకు తెలుసు. బిడ్డలను తల్లి కాకుండా ఎవరు అర్థం చేసుకోగలరు?

గంగులు జైలుకు వెళ్లడం, గంగ కనపడకుండా వెళ్లడం లాంటివి కొండారెడ్డే చేసి ఉంటాడని సుబ్బక్కకు నమ్మకం. గంగను చంపేసి ఉంటాడనే బాధను తట్టుకోలేకపోయింది. పిచ్చిదైనా.. తల్లి మనసు కాబట్టి చంపడమే న్యాయమనుకుంది. చంపకపోతే ఇంకెంతమంది అమ్మాయిల మాన ప్రాణాలకు ముప్పు తలపెడతాడోనని కడతేర్చింది.

***

గంగ మల్యాల కొండల్లో నుండి తొండూరు పోలీసు స్టేషన్ కు వెళ్లింది. శరీరం మొత్తం గాయాలతో ఉన్న గంగను పులివెందుల పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లారు. గంగ మీద అత్యాచారం జరిగిందని వైద్యులు పోలీసులకు చెప్పారు.

గంగ నుండి విషయం తెలుసుకొని తొండూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంకట్ రెడ్డి, కొండారెడ్డి కలిసి నా మీద అత్యాచారం చేశారని, హైదరాబాదులో ఉన్న ఎవరికో నన్ను అమ్మడానికి ప్రయత్నించారని, తప్పించుకొని బతికానని వాంగ్మూలం ఇచ్చింది.

గంగ పులివెందుల ఆసుపత్రిలో ఉందని వేముల దళిత-బహుజనులకు తెలిసింది. చాలామంది పులివెందుల పెద్దాసుపత్రికి వెళ్లారు. కొండారెడ్డి, వెంకట్ రెడ్డి గంగను మానభంగం చేశారని తెలిసి కూడా వెంకట్ రెడ్డిని ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదని పోలీసులను నిలదీశారు.

వెంకట్ రెడ్డి పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నామని దళితులకు తప్పుడు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల తర్వాత గంగులును విడుదల చేశారు. ఒళ్లు హూనమయ్యేలా కొట్టారు.

సుబ్బక్క చనిపోయిందని తెలిసి గంగ పొలోమని ఏడ్చింది. ఉన్న ఒక్కగానొక్క పెద్దదిక్కు లేకుండా పోయిందని బాధపడింది. వెంకట్ రెడ్డి మీద కేసు నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేసి విచారించాలాని పోలీసు స్టేషన్ ను వేముల ప్రజలు ముట్టడించారు.

పోలీసులు అదో ఇదో అన్నారే కానీ వెంకట్ రెడ్డిని అరెస్ట్ చేయలేదు. పులివెందుల పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయడం లేదో గంగకు అర్థమ- య్యింది. వెంకట్ రెడ్డి ఇచ్చే డబ్బుకు అమ్ముడుపోయారని ఆరోపించింది. కడపకు వెళ్లి పెద్ద ఆఫీసర్ కి ఫిర్యాదు చేసింది.

వెంకట్ రెడ్డిని అరెస్ట్ చేసి విచారించాలని పులివెందుల పోలీసుల మీద పైఅధికారుల నుండి ఒత్తిడి పెరగడంతో వెంకట్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వెంకట్ రెడ్డిని అరెస్ట్ చేసిన రోజు రాత్రికి వేములకు వెంకట్ రెడ్డి మనుషులు వెళ్లారు. గంగతో సహా అందరూ గుడిసెలో పడుకున్న సమయంలో గుడిసెకు నిప్పు అంటించారు. మంటలు చెలరేగాయి, గుడిసె నిండా బట్టలే ఉంటాయి కాబట్టి మంటలు నిమిషాల్లో గుడిసె మొత్తాన్ని కమ్మేశాయి.

పల్లె ప్రజలు నీళ్లతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు కానీ కుదరలేదు. గౌరీ, అచ్చక్కను గంగులు కాపాడి బయటకు తెచ్చాడు. గంగ మంటల్లో ఇరుక్కుపోయింది. బకెట్లతో గుడిసె మీద నీళ్లు చల్లి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. ఎంతకూ మంటలు ఆరిపోలేదు. దాంతో గంగులు తడి కంబడిని కప్పుకొని గుడిసెలోకి వెళ్లాడు.

అప్పటికే గంగ శరీరానికి మంట రాజేసుకుంది. మంటల్లో చిక్కుకున్న గంగను కాపాడాలంటే తను కప్పుకున్న తడి కంబడిని గంగకు ఇవ్వాల్సిందే. తను చనిపోయినా పర్వాలేదు గంగ బతకాలనుకున్నాడు.

గంగులు శరీరం మీదున్న కంబడిని గంగకు కప్పి గొల్లపల్లి తాండలో తమ్ముడున్నాడని గంగను గుడిసె నుండి బయటకు దొబ్బేశాడు. బయటపడిన గంగను వేముల ప్రజలు వెంటనే పులివెందుల పెద్ద ఆసుపత్రికి పంపారు.

గంగులు అగ్గిలో తడిశాడు. అచ్చక్క గుడిసెలోకి పరిగెత్తే ప్రయత్నం చేస్తే ప్రజలు పట్టుకున్నారు. నామరూపాలు లేకుండా గంగులు శరీరం మంటల్లో కాలిపోయింది. మోకాళ్ల పైభాగం వరకు గంగ శరీరం కాలింది. నెల రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండాలన్నారు.

గంగులుకు నారాయణ అంతిమసంస్కారాలు చేశాడు. అచ్చక్క ఊపిరి లేని శరీరంలా, ఆకులు లేని చెట్టులా, ఎండిపోయిన నదిలా, విరిగిన కెరటంలా కుప్పకూలింది.

వెంకట్ రెడ్డి మనుషులను కూడా అరెస్ట్ చేశారు. అమాయకులైన అమ్మాయి లను వేశ్యలుగా మార్చడం, వేశ్య కొంపలను నడపడం, అమ్మాయిలను అమ్మడం గురించి పోలీసుల దర్యాప్తులో తేలింది.

పోలీసులు సాక్ష్యాలను కోర్టుకు అందించారు. వెంకట్ రెడ్డి మీద కోర్టులో కేసు నడుస్తూనే ఉంది. శిక్ష ఎప్పుడు పడుతుందో తెలియదు, శిక్ష పడే వరకు పోరాడాలని గంగ నిర్ణయించుకుంది.

@@@

నెల రోజుల తర్వాత గంగ వేముల పల్లెకు చేరుకుంది. గుడిసె ప్రదేశంలో ఏమీ లేదు. మొత్తం బూడిద, మసి, చీకటి. అందరం కలిసి గుడిసె కట్టిస్తామని, ఇక్కడే ఉండమని గంగను బతిమిలాడారు. సరేనని ఒప్పుకుంది. పది రోజులు తిరక్కుండానే వెలుగు, గుడిసె, కొత్త జీవితం మొదలయ్యింది.

సర్వం కోల్పోయినట్లు, తనకంటూ ఏమీ లేనట్టు అనిపించింది. ఏం చేయాలో, ఎలా బతకాలో అర్థంకాలేదు. ఆసుపత్రి నుండి కోలుకుందే కానీ శరీర గాయా లు మానలేదు. మనసుకైన గాయాలు, మచ్చలు మానే అవకాశమే లేదు.

వెంకట్ రెడ్డి, కొండారెడ్డి కలిసి వారం రోజుల పాటు హింసించారు. అవి గుర్తుకు వచ్చి నిద్రలో నుండి ఉలిక్కిపడేది. వదలండి, వదలండి అంటూ గట్టి గట్టిగా కేకలు వేసేది. గంగ కోలుకోడానికి అచ్చక్క దేవుళ్లను, దేవతలను మొక్కుకుంది. దేవుళ్లు ఉలకలేదు, పలకలేదు.

ఎటు చూసినా చీకటి, శూన్యం, ఎడారి. నారాయణ, గౌరీని ఎలా పెంచాలో అర్థంకాలేదు. వేములలో ఉండబుద్ధి కాలేదు. అక్కడే ఉండటం వల్ల పదే పదే తల్లిదండ్రులు గుర్తుకు వచ్చారు. గంగులు చిన్నాన్న తనను కాపాడిన సన్నివేశాలు కళ్లలో మెదులుతూనే ఉన్నాయి. దూరంగా పారిపోవాలి, మనుషులు లేని చోటకు వెళ్లాలనుకుంది.

మనుషులతో మాట్లాడాలంటే భయం, బెణుకు. ఎవరేం చేస్తారోనని భయపడి హడలిపోయేది. అచ్చక్కకు పెద్దగా తెలివి లేకపోయినా గంగకు ధైర్యం చెప్పడానికి ప్రయత్నించింది.

@@@

గంగకు జరిగిన విషయాలు తెలుసుకొని రాజా బాధపడ్డాడు, కుమిలి కుమిలి ఏడ్చాడు. గంగను చూడటానికి వేములకు వెళ్లాడు. గంగను చూసి తట్టుకోలేకపోయాడు. గంగ కన్నుల్లో భయం, బెదురు, అలజడి, మనుషుల మీద అసహ్యం స్పష్టంగా అర్థమయ్యాయి.

'ఎలా ఉన్నావు?' గంగ ఉన్న మంచం మీద కూర్చుంటూ.

'బాగానే ఉన్నానని' సన్నని గొంతుతో చెప్పింది.

'ఎందుకిలా అయిపోయావు? గంగ ఇలా ఉ ఒద్దు,

(మిగతా వచ్చేవారం)



జాని తక్కెడశిల
7259511956



# మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2025

**ఎప్పుడెప్పుడా అని ప్రపంచంలోనే టెక్నాలజీలందరూ అభిలాషులందరూ ఎదురుచూస్తున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2025కార్యక్రమం మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. మార్చి 6 తేదీ వరకు నాలుగురోజుల పాటు స్పెయిన్ లోని బార్సిలోనా నగరంలో జరగనున్నది.**

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ కంపెనీలు తమ కొత్త ఉత్పత్తులు, వినూత్న టెక్నాలజీలను ప్రదర్శిస్తాయి. ఇది కాకుండా కంపెనీలు తాము త్వరలో లాంచ్ చేయనున్న ఉత్పత్తులను కూడా ప్రదర్శిస్తాయి ఇందులో భాగంగా పలు ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు తమ తమ నూతన ఫోన్లు, ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు.

### ఏఐ ఫీచర్లపై ప్రత్యేక దృష్టి

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. ఎందుకంటే గతేడాది ఏఐ ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రజాదరణ పొందింది. అనేక టెక్ కంపెనీలు కూడా తమ ఉత్పత్తులలో ఏఐ ఫీచర్లను చేర్చడం ప్రారంభించాయి. అటువంటి పరిస్థితిలో ఈసారి టెక్నాలజీ మెగా ఈవెంట్‌లో చాలా కంపెనీలు ఏఐ ఫీచర్లతో ఉత్పత్తులను ప్రారంభించవచ్చని భావిస్తున్నారు.

మీరు ఈ ప్రత్యేక ఈవెంట్‌ను చూడటానికి వెళ్లాలనుకుంటే **https://www.mwcbarcelona.com/** వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా దాని కోసం నమోదు చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ తర్వాత మీరు ఈ ఈవెంట్‌కు పాస్ పొందుతారు. మీరు స్పెయిన్‌లోని బార్సిలోనా నగరానికి వెళ్లి ఈ ఈవెంట్‌ను చూడవచ్చు. గత మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌ను చూడటానికి 90,000 మంది ప్రజలు వెళ్లారు. ఈసారి మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ ఈవెంట్‌ను చూడటానికి లక్ష మందికి పైగా ప్రజలు బార్సిలోనాకు చేరుకుంటారని అంచనా.

ప్రస్తుతం ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ట్రెండ్ చాలా వేగంగా పెరుగుతోంది. గత కొన్ని నెలలుగా ఏఐ టెక్నాలజీ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి.

గత మొబైల్‌ఈవెంట్లలో ప్రఖ్యాత కంపెనీలు పేరు పొందిన ప్రఖ్యాత కంపెనీలు తమ ఆవిష్కరణను ఇక్కడ ఆవిష్కరించడం మనము చూస్తూ ఉన్నాము. ఉదాహరణకు శాంసంగ్ తన తాజా ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ సిరీస్ శాంసంగ్ గెలాక్సీ ఎస్24 సిరీస్‌లోని మూడు ఫోన్‌లను ఏఐ ఫీచర్లతో లాంచ్ చేయడం విశేషం. దీనికి కంపెనీ గెలాక్సీ ఏఐ అని పేరు కూడా పెట్టింది. శాంసంగ్ తర్వాత ఒప్పో, వన్‌ప్లస్ కంపెనీలు కూడా తమ స్మార్ట్‌ఫోన్‌ల్లో కొన్నింటిని ఏఐ ఫీచర్లతో తీసుకు వచ్చినవి

ఇటీవల జరిగిన MWC మీడియా సమావేశంలో GSMA డైరెక్టర్ జనరల్, మాట్స్ గ్రాన్‌రిడ్ ఇలా అన్నారు: "MWC25 బార్సిలోనా కోసం ఎంతో

**(మిగతా 8వ పేజీలో)**






(7వపేజీ తరువాయి)

ఉత్సాహంగా ఉన్నాను.మొబైల్ వృద్ధితో మనం చూసిన అదే అంతరాయం కలిగించే శక్తి AI యుగంలో. AI నుండి 5G అడ్వాన్స్,6G వరకు GSMA ఓపెన్ గేట్‌వే ద్వారా ఆవిష్కరించబడిన డిజిటల్ సేవలకు గొప్ప సామర్థ్యం వరకు, MWCలో మాత్రమే మన డిజిటల్ భవిష్యత్తును పునర్నిర్మించడానికి సెట్ చేయబడిన ఈ ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రతిబింబించే ఉత్పత్తులు మరియు ఆలోచనలను మనము చూడబోతున్నాము

MWC ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన మనస్సులలో కొన్నింటిని హోస్ట్ చేస్తుంది, వారు AI మన జీవితాలను ఎలా పునర్నిర్మిస్తుంది, ఆవిష్కరణ మరియు నియంత్రణను సమతుల్యం చేయడంలో సవాళ్లు మరియు మొబైల్ నెట్‌వర్క్‌ల పరిణామంతో సహా అంశాలపై వారి అంతర్దృష్టులను పంచుకుంటారు

ప్రపంచంలో అత్యంత ప్రభావ వంతమైన ఆవిష్కరణలను మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ మనకి1987 నుంచి గత కొన్ని దశాబ్దాలుగా మనకు పరిచయం చేస్తూ ఉన్నది

ఈ సంవత్సరం కాన్ఫరెన్స్ ఎజెండా 5G నుండి AI వరకు కనెక్టివిటీని రూపొందించే కీలక ట్రెండ్‌ల చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది. MWC25 బార్సిలోనా యొక్క 19 దశల్లో దాదాపుగా1,200 స్పీకర్లకు మాట్లాడబోతున్నారు. పైగాస్ఫూర్తి దాయక శ్రేణి, ఇటీవల ధృవీకరించబడిన కీనోట్ స్పీకర్లు ఉన్నాయి

అలీబాబా క్లౌడ్, చైనా యూనికామ్, డేటాబ్రిక్స్, ఇంద్ర, KDDI స్పిరియెన్స్, క్యోసెరా, లిబర్టీ గ్లోబల్, సిమెన్స్, స్వోర్‌ట్రేడ్, టెన్సెంట్ క్లౌడ్, ట్రాన్స్‌యూనియన్ మరియు యుబిక్విటీ. ఈ కంపెనీలT Accenture, AWS, China Mobile, Dell, e&, Ericsson, Google, HPE, Huawei, Lenovo, Meta, Nokia, Orange, Qualcomm, SK Telecom, Vodafone, Xiaomi మరియు ZTE వంటి రిటర్నింగ్ ఎగ్జిబిటర్లు మరియు స్పాన్సర్లుగా ఉన్నాయి.

GSMA మినిస్టీరియల్ ప్రోగ్రామ్ డిజిటల్ ఎకానమీని ఎనేబుల్ చేసే ప్రపంచంలోనే అతిపెద్ద విధాన రూపకర్తల కోసం పరిశ్రమ నాయకులు, ప్రభుత్వ మంత్రులు మరియు నియంత్రణ అధికారులను సమావేశపరుస్తుంది. దాని ఎజెండాలోని అంశాలలో AI పాలన, నెట్‌వర్క్‌ల శక్తి సామర్థ్యం, మొబైల్ మరియు నెట్‌వర్క్ పెట్టుబడి కోసం భవిష్యత్తు స్పెక్ట్రమ్ ఉంటాయి

**డా. వాసిరెడ్డి విజయకుమార్**
**9848647456**

# సలహా (సెటైర్)

వ్యంగ్య దేశపు ప్రధానికి పెద్ద చిక్కు వచ్చిపడింది. మరో ఏడాదిలో ఎన్నికలకు వెళ్ళ బోతోంది దేశం. చాలా సర్వేలు చేయించాడు. తనకూ, తన పార్టీ కీ పరపతి ఎలా ఉందని వాకబు చేస్తే, ఏ గ్రాపు లో చూసినా, గీత అడ్డ గీత దాటి క్రిందకి వెళ్ళి పోయింది. ఏటైమ్ లో జారి క్రిందకు పోయిందో, ప్రస్తుతం ఎక్కడుందో చెప్పలేమంటూ నిష్ఠాతులంతా చేతులెత్తేశారు. ఇక లాభం లేదని సలహాదారుల తో మీటింగు పెట్టాడు. వాళ్ళంతా ఉదయం పిలిస్తే, సాయంత్రానికి వచ్చారు. ప్రధానికి బాగా అర్థమైంది.. తన పరపతి పరిస్థితి.

"చూడండి జంటిల్మెన్. ఎన్నికలు త్వరలో రాబోతున్నాయి. నేను గెలిస్తేనే మీరుంటారు. మన పరపతి చూస్తే పాతాళం దిశగా పలాయనం చేసిందని తెలిసింది. కిం కర్తవ్యం?"

"అది మీరంటే గిట్టనివాళ్ళ పుకారు. మన పార్టీకి మీరు దేవుడు. మీకు ప్రజలు భక్తులు. నేను వాకబు చేయగా తెలిసింది.. వాళ్ళంతా మీకు బ్రహ్మోత్సవాలు లాంటివి చేద్దామనుకుంటున్నారని." అడ్వయిజర్ నంబర్ వన్ అర్ధనిమీలిత నేత్రాలతో ముగించాడు.

ప్రధాని ఆయన మొహంపై నీళ్ళు చిలకరించి, అర్ధనిమీలిత నేత్రాలు పూర్తిగా విచ్చుకునే వరకూ చూసి చెప్పాడు. "ఇదుగో ఇలాంటి వార్తలతోనే ఇందాకా వచ్చింది. వాళ్ళు ఉత్సవాలు చేద్దామను కోవడం లేదు.. నన్ను, మన పార్టీని నిమజ్జనం చేద్దామనుకుంటున్నారు. ఎవరైనా పనికొచ్చే సల హా ఇవ్వండి.



లేదంటే టీ, బిస్కట్లు తినడానికి మాత్రమే నోరు తెరవండి"

"ఇదంతా మీ వల్లనే సర్. మీ మీద జోకులు, కార్టూన్లు, మీమ్స్ వస్తున్నా చూసీ, చూడనట్టు వదిలేశారు. వాళ్ళందరినీ జైల్లో పెడితే సరిపోయేది. మీ మీద ప్రజల్లో భయమూ, భక్తి ఉండేవి."

" ఏడ్చినట్టుంది. ఉన్న పరువు పోయేది. ఉడుక్కుంటున్నట్టు అందరికీ తెలిసేది. ఎందుకిలా అయ్యిందో పక్కన బెట్టి, ఏం చెయ్యాలో అఘోరించండి."

"అయితే ఇబ్బడిముబ్బడి గా ప్రజలకు ఏమైనా పంచేద్దాం సర్,"

"డబ్బులెక్కడివి నాయనా. ఈ మీటింగులో మీకిచ్చిన టీ, బిస్కట్లుకే ప్రపంచ బ్యాంకు రుణం తీసుకున్నాం."

అందరూ బుర్ర గోక్కున్నారు. అందరూ కలిసి ఒక బుర్ర కాదు… ఎవరివి వారు. ఈలోగా సలహాదారు నెంబర్ వన్ కి రెండో ఉప సలహాదారు యొక్క సహాయ అదనపు సలహాదారు లేచి 'సర్, నేను చెప్పొచ్చా' అంటూ సిగ్గు నటిస్తూ నసిగాడు. సరేనన్నాడు ప్రధాని.

"మీరు ట్రోల్స్, మీమ్స్, కథలూ, కాకరకాయలూ బేధం లేకుండా, సకల హాస్య రూపకాలపై పన్ను విధించండి. అవి చదివిన వారు, చూసిన వారు కట్టాల్సిందే అనండి. అటు కామెడీ చేసే వారు తగ్గుతారు, లేదా ఇటు ఖజానా నిండుతుంది. మీరు ఉడుక్కున్నట్టు తెలీదు. పరపతి పెరగక పోయినా, మరింత ఉష్ట్ర పక్షిలాగా ఇసకలోకి దూరిపోవడం ఉండదు."

" ఉన్నంతలో నీ సలహా వెరైటీగా ఉంది గానీ ఏమని చెప్తాం ఈ జీఎస్టీ గురించి."

"ఏముందీ. వాళ్ళు నవ్వడం వల్ల ఆరోగ్యం పెరుగుతుంది. ఆరోగ్యానికి బీమా చేస్తే డబ్బులు కట్టరా ఏం? ఇదీ అలాగే. హాయిగా నవ్వుకుంటుంటున్నందుకు కొంచెం పన్ను కట్టుకోలేరా?"

ప్రధానికి ఐడియా నచ్చింది. ముందు తన మీద పబ్లిక్ లో జోకులు తగ్గుతాయి. అటు రాబడి పెరుగుతుంది. లేచి చప్పట్లు కొట్టాడు.సలహాదారులు చిదతలు కొట్టారు.

(తర్వాత్తర్వాత వ్యంగ్య దేశపు ప్రజలేం కొట్టారో ఇంకో భాగం లో)

**సమాప్తం**

**డా. డి వి. జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం**
**944083691.**

## ఈ వారం కథ

# స్వప్న రాగం

ఒక నూతనోత్సాహము, ఎన్ని మార్లు చూసినా తనివి తీరడం లేదు. మనసులో ఆ రూపే ముద్రించుకుని పోయింది.

ప్రశాంత మయిన సాయం సంధ్య, పక్షుల అలికిడి పక్కనే ప్రవహిస్తున్న చిన్న సెలయేరు. నా చుట్టురా ఉన్న ప్రకృతి సౌందర్యం నన్ను ఏదో స్వప్న లోకాలలోకి తీసుకుని వెళుతోంది . ఇదంతా ఎవరి కోసం సృష్టించబడిందో అనుకుంటూ .. ఉండగా చల్లగా, కొండల మీద నుంచి వీచిన వచ్చిన పిల్ల తెమ్మెర తన తో పాటు మోసుకు వచ్చిన అపురూప సుగంధ పరిమళం, ఓహ్.. అర్ధమయింది. స్వప్న రేఖ వస్తోందని..

అరె.. మీకు చెప్పలేదు కదా! తన గురుంచి. మా ఇద్దరికీ గత మూడు నెలలుగా పరిచయం . ఇక్కడే ఈ కొండల మధ్య ఉన్న ఈ చిన్న ఊరుకి ఒక మూడు నెలలు ట్రైనింగ్ కోసము వచ్చాను. ఈవినింగ్ నా క్వార్టర్స్ వెనుకే పెద్ద స్టేడియం అక్కడకి వెళ్లి కూర్చొని ఫ్లూట్ ప్రాక్టీసు చేసుకునే వాడిని. నా ఫ్లూట్ విని అక్కడ ఒక అందమైన అమ్మాయి, అదీ తెలుగు అమ్మాయి వింటుందని ఏ మాత్రం ఎరుక లేని నాకు,చాలా ఆశ్చర్యం,ఆనందం, చెప్పద్దూ కించిత్ గర్వం కూడా వేసింది. అప్పటి నుంచి రోజు నేను %జూతీఖీఱఎవ% కి రావడం,

తను నా పాట ఎలా ఉందో చెప్పడం పరిపాటి అయింది.

ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. బోలెడు విషయాలు, ముఖ్యంగా సంగీతం సాహిత్యం గురుంచి న చర్చలు ఎక్కువ నడిచేవి.

మధ్య మధ్యలో స్వప్న రేఖ ఆవేశ పడిపోయేది. అప్పుడు ఆ మొహం ఎర్రగా అయిపోయి, కొంచెము ఆయాసం తో రొప్పుతూ, దమ్ము తీసుకునేది.

అయితే తన గురుంచి పెద్దగ చెప్పలేదు. ఇక్కడ వాళ్ళ అన్నయ్య హాస్పిటల్ డాక్టర్ అని మటుకు చెప్పింది. కొన్నాళ్ళు వాళ్లతో గడపటానికి వచ్చానని చెప్పింది. అంతకు మించి వ్యక్తిగత విషయాలు మాట్లాడుకునే అవకాశం ఇవ్వలేదు.

**

ఈ కళాజగత్తు ఒక స్వాప్నిక జగత్తు. వాస్తవ జీవితానికి, కలల ప్రపంచానికి ఏ మాత్రం పొత్తు కుదరదు.

మనిషి లోపల నుంచి ప్రవహించే కళలకి, ఈ బాహ్య ప్రపంచపు రంగులను తెలుసుకోవడానికి కొంత సమయమే పడుతుంది.

"వంశీ గారు, రెండు రోజుల నుంచీ అడుగుతున్నాను బృందావన సారంగ లో పాడమని అదీ కొంచెము ఫ్యూషన్ చేసి వాయించమన్నాను, %practice% #సారా?" కొండగాలంత ఫోర్సు తో వచ్చి అడిగింది.

"ఎస్ స్వప్నా ! అయితే అంతకంటే ముందు ఇంకొకటి కట్టాను. నేనే రాసి నీకోసం ఇప్పుడు వాయిస్తాను. తరువాత బృందావన సారంగ పాడుతాను సరేనా" అంటూ తన జవాబు కోసం ఎదురు చూడకుండా,

"అవి కళ్ళా, కాదు కలువపూలు మిల మిల మెరిసే నక్షత్రాలు, కానీ ఆ కళ్ళ లో కనీ కన్పించని విషాద ఛాయలు, ఓ సృష్టి కర్తా, నాకే గనుక శక్తి ఉంటె ఆ విషాదాన్ని తప్పక తొలగిస్తాను' అంటూ వాయించాను.

పాట అయిపోయింది. ఫ్లూట్ పక్కకు పెట్టి చాల సేపు ఎదురు చూసాను. ఏదైనా అంటుందేమో అని అదీ తన మీద పాట రాసాను అంటే ఎవ్వరైనా ఇంప్రెస్స్ అవుతారు కదా ! అని ఒక ధీమా తో ఉన్నాను.

కొద్ది క్షణాల తరువాత స్వప్న తలెత్తి చూసింది. అందమైన ఆ కళ్ళ నిండా నీళ్ళు. ఒక్క లిప్తపాటు నాకు ఏమి తోచలేదు.

'అయ్యో నేనేమన్నా తప్పు వాయించనా! లేకపోతె తనకి ఇష్టం లేదా,ఆలోచనలు మనసులో సుళ్ళు తిరుగుతూ నాలో నేనే మథనపడుతుండగా,

"వంశీ గారు కానడరాగం లో ఎంత బాగా పాడారో! ముఖ్యంగా కరుణ రసం బాగా పలికించారు. అందుకే కళ్ళు చెమ్మగిల్లాయి" అంది. మామూలుగా అయిపోతూ.

"హమ్మయ్య!' అనుకుంటూ ఇద్దరమూ కబుర్లు చెప్పుకుంటూ కొంచెము సేపు అయ్యాకా విడిపోయాము.

అప్పుడు గుర్తొచ్చింది. అయ్యో తను అడిగిన రంగ పురవిహారా,



బృందావన సారంగ రాగం పాడనే లేదు పోనిలే రేపు కలుస్తుందిగా అప్పుడు వాయిస్తాను. అనుకున్నాను.

అలా ఎన్నో రేపులు, మాపులు గడిచి పోయాయి. తను మటుకు రాలేదు,కలవలేదు.

**

ఐదేళ్లు గడిచాయి. జీవితం లో కొన్ని ధర్మాలు మనకు మనమే నిర్దేశించు కున్నవి ఉన్నాయి! కొన్ని సంఘం కోసం కొన్ని కుటుంబం కోసం అందులో ముఖ్యంగా పెళ్లి, ఉద్యోగం లాంటివి. కానీ నేను ఆ చట్రం లో ఉండదలచుకోలేదు. స్వేచ్ఛగా నాకు నచ్చిన రీతి లో వెళ్లాలనుకున్నాను . ఆ దారి ఏమిటో గ్రహించుకున్నాను, అందుకు నాకు అమ్మ నాన్న కూడా సపోర్ట్ ఇచ్చారు.చేస్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, కొంత మంది స్నేహితులము కలిసి ఒక బ్యాండ్ ఏర్పరచుకున్నాము.

ప్రదర్శనలు ఇస్తూ మా బ్యాండ్ కి ఒక గుర్తింపు తెచ్చుకున్నాము. మా బ్యాండ్ పేరు "స్వప్న రాగం" అని పెట్టుకున్నాను.

అమ్మా వాళ్ళు నన్ను పెళ్లి చేసుకోమంటున్నారు. నేను వాయిదా వేస్తూ నే ఉన్నాను. అయితే నా ఆలోచన వేరు రహస్యంగా నా మనసు స్వప్న రేఖ కోసం వెదుకుతూనే ఉంది. కానీ ఎక్కడ కనిపించలేదు. ఏ విధమైన సమాచారం కూడా దొరకలేదు.

ఊపిరి సలపనంతగా ప్రోగ్రామ్స్ వస్తున్నాయి. ప్రజలలో మా మీద అభిమానం పెరిగింది. మేము ముఖ్యంగా కర్ణాటక సంగీతం అలాగే పాత లలిత గీతాలు కూడా ఫ్యూషన్ చేసి పాడుతున్నాము. నేను ఫ్లూట్,ఇంకో అతను గిటార్ మిగతా ఇద్దరూ పాడే వాళ్ళు. అయితే అందరూ పాడతాము. అందరూ ఇన్స్ట్రుమెంట్స్ వాయించే వాళ్ళమే !

పెద్ద పెద్ద కార్పొరేట్ ఆఫీస్ లో వాళ్ళకల్చరల్ ప్రోగ్రామ్స్ లో మా బ్యాండ్ ని బాగా పిలుస్తున్నారు. అలా మాకు కోల్ కత్తా వెళ్ళే ఛాన్స్ వచ్చింది. అది దసరా పండుగలు, దుర్గాపూజా సమయం . నగరం వెలిగిపోతోంది. మాకు ఒక స్టార్ హోటల్ లో బస ఏర్పాటు చేసారు. ఆ మరునాడు మా ప్రోగ్రాం ఒక పెద్ద కార్పొరేట్ ఆఫీస్ ఆడిటోరియం లో, మా కోసము వచ్చిన కో ఆర్డినేటర్, పొద్దున్నే వచ్చి అక్కడికి తీసుకుని వెళ్ళాడు. మేము అక్కడ సౌండ్ ,లైట్స్, ప్లేస్ మెంట్ మైక్ సిస్టం అన్ని చెక్ చేసుకుంటూ ప్రాక్టీసు చేసుకున్నాము. ప్రోగ్రాం ఐదు గంటల నుంచి. మేము అక్కడకి మూడున్నర కల్లా ఉండేలా ప్లాన్ చేసుకున్నాము

అనుకున్న సమయం రానే వచ్చింది. కోల్ కత్తా కాబట్టి కొన్ని రవీంద్రుని గీతాలు తో పాటు దుర్గాస్తోత్రం.. మహిషాసుర మర్ధిని కూడా ఇద్దరు పాడారు, నేను ఫ్లూట్ మీద వాయించాను. ఈ ఐదేళ్లలో నేను రంగ పురవిహార పాట మటుకు తప్పనిసరిగా స్వప్నరేఖకు డెడికేట్ చేస్తూ పాడతాను. ఇవాళ కూడా అది పాడాను.

అందరూ ఆపకుండా చప్పట్లు కొడుతున్నారు. ఇంతలో ఒక అమ్మాయి పరుగు పరుగున స్టేజి ఎక్కి నన్ను గట్టిగ హగ్ చేసుకుని.

"నాకు తెలుసు నువ్వు ఈ పాట నా కోసం పాడతావని, ఐదేళ్ల నుంచి వెతుకుతున్నాను". అంటూ ఏదేదో మాట్లాడేస్తోంది తెలుగు లో " ఇట్స్ ఓకే ఓకే " అని తన భుజం తట్టి, థాంక్స్ చెప్పి పంపేసాను.

కానీ ఆమె స్టేజి దిగుతూ చూసిన చూపు ఏదో సొంత వస్తువును చూసినట్లు అనిపించింది.

కానీ తను స్వప్న కాదే అనుకున్నాను.ఎంత ఇన్ని రోజులు చూడక పోయినా అనుకున్నాను. మొత్తం మనిషి మారిపోదు కదా!

ప్రోగ్రాం అయి రాత్రి హోటల్ కి వచ్చాకా కూడా ఆమె ఆలోచనలే,మనిషి తెలియదు కానీ ఏదో పట్టి లాగుతోంది.

మరునాడు ఉదయమే మా కో ఆర్డి నేటర్ ని అదిగి ఆమె అడ్రస్ కనుక్కోమని చెబితే,అతను ఎలా సంపాదించాడో తెలియదు అడ్రెస్ కనుక్కుని నాకు చెప్పాడు, కారు ఆపి వెతుక్కుంటూ వెళ్ళాను. పండగ సెలవులు కావడం తో తను ఇంట్లోనే ఉంది. తన అమ్మ నాన్న కూడా ఉన్నారు. నా రా క వాళ్ళకి కొంత ఆశ్చర్యాన్ని కలుగ చేసింది.

అప్పుడు అన్నాను "మీతో కొంచెం మాట్లాడాలి" సరే అన్నట్లు తలూపింది. "మీకు ఎవరైనా సిస్టర్స్ ఉన్నారా" "లేరు" అంది. "మరి నా పాట గురించి ఎలా తెలుసు" అన్నాను.

"అదే నాకు వింతగా అనిపిస్తోంది. టీవీ లో, %ఎశీబ% ట్యూబ్ లో మిమ్మలిని చూసినప్పుడల్లా మీరు నాకు ఎప్పటి నుంచో పరిచయం ఉన్నట్లుగా అనిపించేది. %ఖీఎ% లో రిక్వెస్ట్ పెట్టాను,%ఱఅఝ% లో ఫాలో అయ్యేదాన్ని. ఏదో పూర్వజన్మ నుంచి తెలిసినట్లుగా అనిపించేది" అంది.

అప్పుడు నా ఫోన్ తీసి అందులో ఉన్న స్వప్న రేఖ ఫోటో చూపించాను. "ఈమె ని ఎప్పుడన్నా చూసారా?" అని అడిగితే "లేదు" అంది.

ఇంతలో వాళ్ళ నాన్న వచ్చి నా చేతి లోని ఫోటో చూస్తూ "ఏమిటి ఇదంతా అని కాస్త అసహనంగా" అడిగాడు.

ఆయన తీరు చూస్తుంటే నాకు మాట రావటం లేదు "ఏమీ లేదు.. లేదు. ఒక చిన్న మిస్ కమ్యూనికేషన్" అంటూ తిరిగి వచ్చేసాను.

అక్కడి తో ఆ విషయం మరుగున పడింది...

అనుకోకుండా కొన్నిరోజులకు నేను స్వప్నను కలిసిన ఊరికి అదే నేను ట్రైనింగ్ కి వెళ్ళిన ప్లేస్ లో న్యూ ఇయర్ డే రోజున ఒక మా ప్రోగ్రాం కన్ఫర్మ్ అయింది.

ప్రోగ్రామ్ జరుగుతున్నప్పుడు స్వప్న రేఖ అన్నయ్య అదే డాక్టర్ కనిపించారు.

అప్పుడు జరిగిన విషయాలు కళ్ళముందు తిరిగాయి

మా వాళ్ళకి చెప్పి ఆయన్ని ప్రోగ్రామ్ అయ్యాక కలుస్తాను అని చెప్పమన్నాను.

ప్రోగ్రామ్ అయ్యే వరకు అతను ఉన్నారు

నేను అతని దగ్గరకు వడి వడిగా నడిచాను.

అతనూ నా రాక కోసం ఎదురు చూస్తున్నాడు. నన్ను సంశయంగా చూస్తూ 'మీరు'%ఔ% అన్నాడు.నా పేరు చెప్పా గానే "అవును రేఖ చెప్పింది మీ గురించి "అన్నాడు.

ఇంతకూ రేఖ ఎక్కడ?

అన్నాను

"తను లేదు, రాలేదు"

"అంటే"

"ఈ లోకమే విడిచి వెళ్ళింది" అతని గొంతు భారం గా వినిపించింది

నేను ఆదుర్దా ఆపుకో లేక "స్వప్న రేఖ కు ఏమైంది అసలు " అన్నాను.

"రేఖ గుండె ఒక గాజు బొమ్మ అది ఎప్పుడో భళ్ళుమంటుందని డాక్టర్ గా తెలుసు , అందుకే అది ఏమి చేసినా అడ్డు చెప్పే వాడిని కాదు పైగా అంది,

"అన్నయ్యా, నేను లేకున్నా ఉండాలని నిర్ణయించు కున్నా అందుకే నా అవయవాలు కొన్ని జీవితాలకయినా ఉపయోగ పడాలి" అని

తన అవయవాలు డొనేట్ చేసింది. అని చెప్పారు." ?

అప్పుడు అర్ధమయింది.

ఆవేశం తో రొప్పుతూ, చేత్తో గుండెల మీద రాసుకుంటూ ఉన్న రేఖ మొహం కళ్ళముందు మెదిలింది. అయ్యో! అస్సలు నాకు తెలియలేదే తన ఆరోగ్య పరిస్థితి అని బాధ పడుతున్న సమయం లో కలకత్తాలో ఆమె గుర్తొచ్చింది.

చప్పున్న రేఖ రూపం కళ్ళముందు మెదిలింది.. ఏ మాత్రం పోలిక లేదు ఇద్దరికీ,

కానీ ఏదో కలుపుతోంది

అవయవదానం గుప్తంగా ఉంటుంది. ఏమో రేఖ లోని ఏదో ఒక అవ-యవం ఆమె లో ఉందా? అసలు ఆమె కు ఏదైనా ఆపరేషన్ జరిగిందా ఏదీ తెలియదు. అయినా నా మనసు గాఢంగా నమ్ముతోంది.

అప్రయత్నంగా నేను రాసిన పాట లోని వాక్యాలు, పలికిన గీత గుర్తుకొచ్చింది.

రేఖ అన్నా గీత అన్నా ఒకటే

అవి స్వప్న రాగాలు .

మణి వడ్లమాని, 9652067891

# హైదరాబాద్ వేడి వాతావరణంతో డీహైడ్రేషన్ ప్రమాదం

హైదరాబాద్ : వేసవి సమీపిస్తున్న కొద్దీ, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అంటు వ్యాధులు వ్యాప్తి చెందడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి, డీ హైడ్రేషన్ ను మరింత ఆందోళనకరంగా మారుస్తాయి. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే వరకు ఇది గుర్తించబడదు. డీ హైడ్రేషన్ సాధారణంగా తీవ్రమైన దాహంతో ముడిపడి ఉంటుంది, కానీ చాలా సందర్భాలలో, ఇది సూక్ష్మంగా అభివృద్ధి చెందుతుంది, ముఖ్యంగా నిశ్శబ్ద డీ హైడ్రేషన్ రూపంలో ఉండటం చేత తరచుగా ఇది గుర్తించబడదు. దీనికి తోడు , ఇన్ఫెక్షన్లు లేదా జీర్ణశయాంతర సమస్యల వల్ల కలిగే అతిసార నిర్జలీకరణం, ప్రాణాంతకమయ్యే అవకాశాలు కూడా వున్నాయి , ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు గతంలో అనారోగ్య పరిస్థితులు ఉన్న వ్యక్తులలో ఇది మరింత సమస్యగా పరిణమించవచ్చు.

హైదరాబాద్ వేడి వాతావరణం మరియు దాని నీటి వనరులు తక్కువగా కూడిన పరిసరాలతో సహ ప్రత్యేకమైన భౌగోళిక లక్ష ణాలు డీహైడ్రేషన్ ప్రమాదాలను మరింత పెంచుతాయి. నగర నివాసితులు దీర్ఘకాలిక వేడి మరియు అప్పుడప్పుడు నీటి కొరతను ఎదుర్కొంటున్నందున, తగినంత పరిమాణంలో నీటిని వినియోగిం చని వ్యక్తులు డీహైడ్రేషన్ సంబంధిత ఆరోగ్య సమస్యల బారిన పడేందుకు ఎక్కువ అవకాశాలు వున్నాయి. డీహైడ్రేషన్ యొక్క వివిధ కారణాలు మరియు లక్షణాలను అర్థం చేసుకోవడంతో పాటు, వేగంగా కోలుకోవడానికి తగిన హైడ్రేషన్ పరిష్కారాలను కూడా నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

హైదరాబాద్లోని కేర్ హాస్పిటల్స్ లో గ్యాస్ట్రోఇంటెస్టినల్ సర్జన్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ బి. రవీందర్ రెడ్డి నిశ్శబ్ద డీహైడ్రేషన్ యొక్క రహస్య ప్రమాదాలను నొక్కి చెబుతూ, "తీవ్రమైన దాహం వంటి సాధారణ హెచ్చరిక సంకేతాలను ప్రేరేపించకుండా , శరీరం ద్రవా లు మరియు అవసరమైన ఎలక్ట్రోలైట్లను కోల్పోయినప్పుడు నిశ్శబ్ద డీహైడ్రేషన్ సంభవిస్తుంది. ఇది ముఖ్యంగా మధుమేహం ఉన్న వ్యక్తులలో ఆందోళన కలిగిస్తుంది, వారు ఇప్పటికే రక్తంలో అధిక చక్కెర స్థాయిల కారణంగా ద్రవ సమతుల్యతలో హెచ్చుతగ్గులను అనుభవించవచ్చు. తగినంత ద్రవాహారం తీసుకోక పోవడం, కఠినమైన వ్యాయామం, అధిక ఉష్ణోగ్రతలు, మద్యం సేవించడం, జ్వరం, వికారం మరియు వాంతులు వంటి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కారకాలు ఉ



ండటం వల్ల డయాబెటిక్ రోగులకు డీహైడ్రేషన్ మరియు ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ప్రమాదాన్ని పెంచుతాయి. తేలికపాటి డీహైడ్రేషన్ కూడా మెదడు పనితీరు, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. నిశ్శబ్ద డీహైడ్రేషన్ సమస్యను నిర్వహిం చడానికి మరియు నిరోధించడానికి, సాదా నీటి కంటే ఎలక్ట్రోలైట్ ఆధారిత హైడ్రేషన్ సొల్యూషన్లను తీసుకోవడం మంచిది. సోడియం, పొటాషియం మరియు మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్లు కణజాల సమతుల్యతను నిర్వహించడానికి , ద్రవ అసమతుల్యత ను నివారించడానికి సహాయపడ తాయి. మధుమేహం ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలి, ఎందు కంటే వారు మూత్రవిసర్జన అధికంగా చేయటం , మారిన దాహపు అలవాట్ల కారణంగా డీహైడ్రేషన్కు గురవుతారు. క్రమం తప్పకుండా ద్రవాహారం తీసుకోవడం, తక్కువ చక్కెరతో ఎలక్ట్రోలైట్ అధి కంగా ఉండే పానీయాలను కలుపుకోవడం, హైడ్రేషన్ మరియు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక చక్కటి విధానం" అని అన్నారు. ఇదే సమయంలో , అతిసార డీహైడ్రేషన్ యొక్క ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మిగిలిపోయింది, ముఖ్యంగా పిల్లలలో అని, %=ఎవీ% మెడికల్ కాలేజీలోని పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ సి. సురేష్ కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ : "అంటువ్యాధులు, ఫుడ్ పాయిజనింగ్ లేదా జీర్ణశయాంతర రుగ్మతల కారణంగా వేగంగా నీటిని కోల్పోవడం వల్ల అతిసార డీహైడ్రేషన్ సంభవిస్తుంది. నిశ్శబ్ద డీహైడ్రేషన్ వలె కాకుండా, దాని ప్రభావాలు ఆకస్మికంగా మరియు తీవ్రంగా ఉంటాయి, ఇది రక్త పరిమాణం మరియు అవసరమైన పోషకాలలో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తుంది. చికిత్స చేయకుండా వదిలేస్తే, ఇది షాక్, అవయవ వైఫల్యం లేదా మరణం వంటి సమస్యలకు దారితీస్తుంది. అతిసార డీహైడ్రేషన్ ను నిర్వహించడానికి బంగారు ప్రమాణం %ఔూ% సిఫార్సు చేసిన ఓరల్ రీహైడ్రేషన్ లవణాలు . ఎలక్ట్రోలైట్లు మరియు గ్లూకోజ్ యొక్క ఈ శాస్త్రీయంగా రూపొందించబడిన మిశ్రమం ద్రవాల యొక్క సరైన శోషణను నిర్ధారిస్తుంది మరియు కోల్పోయిన ద్రవం , ఎలక్ట్రోలైట్లను తిరిగి నింపడంలో సహాయపడుతుంది. తీవ్రమైన డీహైడ్రేషన్ ను నివారించడానికి అతిసారం యొక్క ప్రారంభ సంకేతాల వద్ద %ూూ% అందించటం ప్రారంభించడం చాలా ముఖ్యం. అదనంగా, తగినంత ఆహారం (వైద్యుడు సిఫార్సు చేసినట్లు) మరియు జింక్ సప్లిమెంటేషన్ పిల్లలు వేగంగా కోలుకోవడానికి సహాయపడతాయి. చాలా మంది ప్రజలు పొడి ORS ను కలిపేటప్పుడు తయారీ విధానంలో తప్పులు చేస్తారని, ఇది మార్పు చెందిన ఓస్మోలాలిటీ మరియు తగ్గిన ప్రభావానికి దారితీస్తుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి. సరైన తయారీ పద్ధతి గురించి మీకు ఖచ్చితంగా తెలియకపోతే, త్రాగడానికి సిద్ధంగా ఉన్న %ూూ% ఫార్ములేషన్లను ఎంచుకోవడం ఉత్తమం. ORS గురించి ప్రజలకు అవగాహన కల్పించడం మరియు ముందస్తు జోక్యం చేసుకోవడం వల్ల అతిసార వ్యాధుల భారం గణనీయంగా తగ్గుతుంది.." అని అన్నారు,

వేసవి కాలం ప్రారంభం కావడంతో, నిపుణులు డీహైడ్రేషన్ తో పాటుగా డీహైడ్రేషన్ కు కారణమయ్యే వివిధ పరిస్థితులు, అలాగే వేగవంతమైన రీతిలో కోలుకోవడానికి సమగ్ర పరిష్కారాల గురించి అప్రమత్తంగా ఉండటం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నారు. ఎలక్ట్రోలైట్-ఆధారిత పరిష్కారాల ద్వారా నిశ్శబ్ద డీహైడ్రేషన్ ను నిర్వహించడం లేదా %ఔ.ఐ.ూ ూూ% ఫార్ములేషన్లతో అతిసార డీహైడ్రేషన్ సమస్యను పరిష్కరించడం, తగిన చర్యలు తీసుకోవటం మరియు సకాలంలో జోక్యాలను చేసుకోవటం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కీలకం. ముఖ్యంగా వేడి వాతావరణంలో తగినంత నీరు తీసుకోవటం చేయాలని మరియు అవసరమైనప్పుడు వైద్య సహాయం పొందాలని నివాసితులకు సూచించటమైనది.

విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'లైలా'. దీని స్పెషాలిటీ ఏమిటంటే... ఈ సినిమాలో ఆయన లేడీ గెటప్ వేయడం. విశ్వక్ మొదటిసారి మహిళ పాత్ర చేయడంతో బజ్ వచ్చింది. అయితే... నటుడు 30 ఇయర్స్ పృథ్వీరాజ్ ప్రీ రిలీజ్ వేడుకలో చేసిన కామెంట్స్, ఆయన వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో వైసీపీ చేసిన బాయ్ కాట్ ట్రెండ్ సినిమాకు ఎక్కువ ప్రచారం తీసుకు వచ్చింది. దాంతో ప్రేక్షకులు చూపు దీని మీద పడింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ సినిమా ఎలా ఉంది? అసలు ఇందులో ఏముంది? అనేది చూస్తే...

**కథ :** హైదరాబాద్ పాతబస్తీలో సోను (విశ్వక్ సేన్)కి బ్యూటీ పార్లర్ ఉంది. అతను వేసే మేకప్ అంటే మహిళలు అందరికీ ఎంతో ఇష్టం. సోను గురించి మహిళలు అందరూ గొప్పలు చెబుతూ ఉండడంతో భర్తలు అతని మీద కోపం పెంచుకుంటారు. ఫ్రీగా మేకప్ చేయమని, తాను ఎస్ఐ శంకర్ (బబ్లూ పృథ్వీరాజ్) భార్య అని ఒక మహిళా వస్తే... ఎస్ఐ అసలు భార్యకు ఫోన్ చేసి రప్పిస్తాడు సోను. వాళ్ళిద్దరి మధ్య రోడ్డు మీద గొడవ జరగడంతో శంకర్ పరువు పోతుంది. పాతబస్తీలోని పహిల్వాన్ రుస్తుం (అభిమన్యు సింగ్) తండ్రికి చిరంజీవి అంటే పిచ్చి. తనకు కాబోయే కోడలు చిరంజీవి సినిమా అంత అందంగా ఉండాలని కోరుకుంటాడు. ఎంతో మంది అమ్మాయిల్ని రిజెక్ట్ చేసిన తర్వాత సోను వేసిన మేకప్ చూసి అతిలోకసుందరిలో ఉందని ఒక అమ్మాయి (కామాక్షి భాస్కర్ల)ను ఇచ్చి పెళ్లి చేస్తాడు. ఆవిడ మేకప్ లేని ఫేస్ (నల్లగా ఉండటం) చూసి ఆగ్రహంతో ఊగిపోయిన రుస్తుం సోను బ్యూటీ పార్లర్ మీదకు తన మనుషులని పంపిస్తాడు. మరొకవైపు కల్తీ నూనె కేసులో సోను పేరు వినబడుతుంది.

ఒకవైపు ఎస్ఐ శంకర్, మరొకవైపు రుస్తుం, ఇంకొక వైపు కల్తీ నూనె కేసు... ఆగ్రహంతో ఉన్న ప్రజలు సోను కనపడితే కొట్టేందుకు సిద్ధంగా ఉంటారు. దాంతో 'లైలా'గా మారుతాడు సోను. ఆ తర్వాత తన సమస్యలను ఎలా పరిష్కరించుకున్నాడు? ఆ ప్రయాణంలో అతను ప్రేమించే అమ్మాయి జెన్నీ (ఆకాంక్ష శర్మ), సునిశిత్ (సునిశిత్) పాత్రలు ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :** ఇటువంటి కథతో హీరోని దర్శకుడు రామ్ నారాయణ్ ఎలా ఒప్పించాడు? అని సినిమా మొదలైన కాసేపటికి సందేహం కలుగుతుంది. విశ్రాంతి వరకు రొటీన్ సీన్స్, కామెడీ ఉన్న సినిమాతో హీరోని




ఒప్పించినందుకు దర్శకుడుని కాస్త పొగడాలని అనిపిస్తుంది. విశ్రాంతి తర్వాత విశ్వక్ సేన్ ఈ కథను ఎలా ఒప్పుకొన్నాడు? ఇందులో హుక్ చేసే పాయింట్ అతనికి ఏం కనిపించింది? అని సందేహం వస్తుంది. విశ్వక్ సేన్ లేడీ గెటప్ వేయడం తప్పిస్తే ఈ సినిమాలో కొత్తదనం కొంచెం కూడా లేదు. ఆ లేడీ గెటప్ కూడా అతడికి సెట్ కాలేదు.

'లైలా'కు విశ్వక్ సేన్ హీరో అని చెప్పడం కంటే... అభిమన్యు సింగ్, సునిశిత్ హీరోలను చెబితే బాగుంటుంది. విశ్వక్ సేన్ పాత్రతో సమానంగా అభిమన్యు సింగ్ పాత్రకు స్క్రీన్ స్పేస్ లభిస్తే... సునిశిత్ పాత్రకు ఇంపార్టెన్స్ లభించింది. కథ, సీన్స్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. హీరో ఎందుకు మేకప్ ఆర్టిస్ట్ అయ్యాడనే సెంటిమెంట్ గానీ, హీరోయిన్ లవ్ ట్రాక్ గానీ కొంచెం కూడా బాలేదు. కాస్తో కూస్తో అభిమన్యు సింగ్ సీన్స్ తప్ప. కమర్షియల్ సినిమాలను లెక్కలు వేసుకొని, క్యారెక్టర్స్ ఆర్క్ వంటి బేరీజులు వేసుకుని చూడకూడదని ఆయా అంశాలను పక్కన పెట్టేసినా... హీరోతో పాటు దర్శక నిర్మాతలు ఏవైతే కమర్షియల్ హంగులని ఫీలయ్యారో? అవన్నీ ప్రేక్షకులను విసిగిస్తాయి. సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకులను విశ్వక్ సేన్, రామ్ నారాయణ్ చిన్న చూపు చూశారని అనిపిస్తుంది. హీరోయిన్ గ్లామర్ చూపిస్తే చాలు అన్నట్టు కొన్ని సీన్లు స్కిన్ షోతో నింపిస్తే... రొట్ట రొటీన్ కామెడీ సీన్లతో మరికొన్ని సీన్లు తీశారు. ఒక పద్ధతి పాడు ఉండవు. తాము రాసింది, చేసింది జనాలు చూస్తారన్నట్టు తీసుకుంటూ వెళ్లారు.

లియోన్ జేమ్స్ సంగీతం అందించిన పాటల్లో రిపీట్ వేల్యూ ఉన్న పాట ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. నేపథ్య సంగీతంలో కూడా మెరుపులు లేవు. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ ఓకే. కమర్షియల్ సినిమాకు ఎలా ఉండాలో అలా ఉంది. షైన్ స్క్రీన్స్ అధినేత సాహు గారపాటి నిర్మాణ విలువలు ఓకే. పాటల కోసం విదేశాలు వెళ్లారు. రిచ్ లొకేషన్స్ ఎంపిక చేసుకోవడంతో పాటు సినిమా కోసం భారీ సెట్ వేశారు. మాటల్లో డబుల్ మీనింగ్స్ ఎక్కువ దొర్లాయి. విశ్వక్ సేన్ రెండు క్యారెక్టర్లు చేశారు. సోను మోడల్ ఒకటి అయితే... లైలా మరొకటి. సోను పాత్రలో అతడి నటన మామూలే. ఎనర్జిటిక్ యువకుడిగా పాత్రకు కావాల్సిన హుషారు చూపించారు. లైలాగా నటించేందుకు అంగీకరించిన హీరోని అభినందించాలి. అయితే... ఆ లేడీ గెటప్ క్యారీ చేయడంలో, సన్నివేశాలకు తగ్గట్టు నటించడంలో పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేదు. రుస్తుం పాత్రలో అభిమన్యు సింగ్ నటన మెప్పిస్తుంది. లైలాకు ముందు కామెడీ టచ్ ఉన్న క్యారెక్టర్లు కొన్ని చేసినా... ఇందులో పెళ్లి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు వల్ల నవ్వించడం సులభమైంది. ఆయనకు ఇది ఒక డిఫరెంట్ క్యారెక్టర్ అని చెప్పవచ్చు. అన్నట్టు ఒక పాటలో ఆయన డాన్స్ కూడా చేశారు.

హీరోయిన్ ఆకాంక్ష శర్మ విషయానికి వస్తే... నటన తక్కువ, అందాల ప్రదర్శన ఎక్కువ. ఓ పాటలో బికినీ వేశారు. సన్నివేశాలకు అవసరం లేకపోయినా స్కిన్ షో చేశారు. సునిశిత్ రియల్ లైఫ్ క్యారెక్టర్ చేశారు. యూట్యూబ్ ఇంటర్వ్యూల్లో అతడు చేసే అతిని కామెడీ కోసం వాడుకోవాలని దర్శక రచయితలు ప్రయత్నించారు. అది వర్కౌట్ కాలేదు. ఎస్ఐ శంకర్ పాత్రలో బబ్లూ పృథ్వీరాజ్ రెగ్యులర్ విలన్ క్యారెక్టర్ చేశారు. నటుడు 30 ఇయర్స్ పృథ్వీరాజ్ పాత్ర పరిధి తక్కువ. ఆయన క్యారెక్టర్ లెంగ్త్ కంటే సోషల్ మీడియాలో జరిగిన ట్రోల్స్, ఇంటర్వ్యూల స్క్రీన్ స్పేస్ ఎక్కువ. కామాక్షి భాస్కర్ల డీ గ్లామర్ రోల్ చేశారు. సురభి ప్రభావతి సహా మిగతా ఆర్టిస్టులు తమ పాత్రలకు తగ్గట్టు నటించారు.

లైలా... ప్రేక్షకులకు లేడీ గెటప్ ఒక్కటే చాలదమ్మా! రెండున్నర గంటలు థియేటర్లలో కూర్చోవాలంటే అంతకు మించిన కథ, కథనం, కామెడీ కూడా ఉండాలి. మధ్యలో కొన్ని నవ్వులు సరిపోవు. రొటీన్ కమర్షియల్ ఫార్మాటులో తీసే సినిమాలకు వినోదంతో పాటు సంగీతం కూడా బావుండాలి. దురదృష్టవశాత్తు ఈ సినిమాలో అవేవీ లేవు. సో... థియేటర్లకు వెళితే టైమ్ అండ్ మనీ వేస్ట్.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 16.2.2025 నుండి 22.2.2025 వరకు ద్వాదశ రాశి ఫలితాలు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోరోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. అనుకున్న విషయాలు శ్రమతో కొంతమేర సత్ఫలితాలు నిస్తాయి.ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసు కుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు.సంతానము తో, ఆత్మీయ వ్యక్తులతో ఆహ్లాదకరంగా గడుపుతారు. వారం మధ్యలో భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి వృత్తిపరమైన అభివృద్ధి ఉన్నప్పటికీ, ఆరోగ్య విషయంలో ప్రత్యేకశ్రద్ధతీసుకోవాలి.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారము ప్రారంభంఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్న ప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. ఆకస్మిక బహుమానాలు అం దుకుంటారు, భాగస్వామికి సంబంధించి కొత్త నిర్ణయా లు ఆశాజనకంగా ఉంటాయి. సంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. గృహ వాతావరణం ఉత్సా హంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. వారం మధ్యలో వృత్తిపరమైన విషయాలలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూ-ర్వరుణాలుచెల్లిస్తారు, బంధుమిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు..



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి.తల్లి ఆరోగ్య ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. మిత్రులతో అనుకూలంగా ఉంటుంది. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువులకు నూతన అవకాశములు. మీ సహకారం ఉంటుంది వారికి. వారం మధ్యలో స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి. సంతానమునకు విద్యాపరంగా అభివృద్ధి కొరకు కృషి చేస్తారు. ఎంతోకాలం ఎదురుచూస్తున్న దూర ప్రదేశంలో నుంచి అందుకున్న ఒక వార్త ఆనందాన్ని స్తుంది. విదేశీ ప్రయత్నాలు చేస్తారు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోమిత్రులతో సన్నిహితులతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతారు.కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు.మిత్రుల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. నిర్ణయాలు ధైర్యంగా తీసుకుం టారు. ఆదాయ వనరులు మిశ్రమముగా ఉంటుంది. వారము మధ్యలో గృహ వాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పని పూర్తి చేసుకున్నట్లయితే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలోయదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కొన్ని పనులలో, ఆర్థిక సంబంధమైన అంశాలలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలు. మాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది.వాతావరణం ఆహ్లాదకరంగా ఉ ం టుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమ-ును అందుకుంటారు. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయ త్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయి స్తారు. వారం మధ్యలో కుటుంబంలోని వ్యక్తుల ప్రోత్సాహం, ముఖ్యంగా సోదరి వర్గం యొక్క సహకారం పెరుగుతుంది. నిర్ణయాలు తీసుకుంటారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభ భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారుఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది.ఆరోగ్యం బాగుంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారుశారీరక శ్రద్ధ, అలంకరణమీద ఆసక్తి పెరుగు తాయి. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. దూర ప్రయా ణానికి సంకల్పం చేస్తారు. ఆకస్మికమైన ఖర్చులు ఉంటా యి.కుటుంబ ఆదాయంలో కొంత ఆటంకాలు ఉంటాయి, కన్ను మరియు పన్ను వంటిఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల్ని సంప్రదించాలి. వ్యక్తిగత సంతోషం కొరకు పెడుతున్న ఖర్చులు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. .వ్యక్తిగత అంశములలో తీసుకొని నిర్ణయాలు ధైర్యంగా ఉంటాయిఅనుకూలిస్తాయి. దగ్గరప్రయాణాలుచేస్తారు,ఆత్మీయులుసహకరిస్తారు,



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

ప్రారంభం ఆధ్యాత్మిక ఆలోచనలతో , క్షేత్ర సందర్శన పుణ్యస్నానాలతో స్వాగతం పలుకుతారు.అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసం తృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియో గము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి.కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. వారము మధ్యలో ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ప్రారంభం చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఉత్సా హంగా గడుస్తుంది. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, వృత్తిలో ఆశించిన స్థానాన్ని పొందటానికి అధిక శ్రమ పడతారు.తగినగుర్తింపుపొందుతారు. మనసు లోని కోరికలునెరవేరుతాయి. సంతోషంగాశుభవార్తలతో వృత్తిపరమైనఅభివృద్ధితో,మొదలవుతుంది. తండ్రి,పెద్దలు నుంచి, దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు.నూతన విషయాలు తెలుసుకుంటారు వృత్తి లో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశ ము లకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉ ండడం ఆనందాన్ని స్థాయి.మధ్యలో వృత్తిపరంగా నూతన బాధ్యతలు ప్రయాణాలు, కొత్త వ్యక్తుల కలయిక, శ్రమ బడలిక ఉన్నప్పటికీ చలాకీగా వాటిని అధిగమిస్తారు



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలోవృత్తికి సంబంధించిన విషయాలలో అభివృద్ధి,నూతన అవకాశముల కొరకు సహకారం కొరకు రాజకీయ నాయకుల్ని పలుకుబడి కలిగిన వ్యక్తుల్ని కలిసి చర్చలు సాగిస్తారు. సంతాన సంబంధ విద్యా ఆరోగ్య అభి వృద్ధిఅంశములలోకొన్నిఉద్వేగాలకు లోనవుతారు.దగ్గరలోఉ న్నపుణ్యక్షేత్రాన్నిసందర్శిస్తారు.నూతన విషయాలు నేర్చుకుం టారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ అవసరము. వృత్తిపరంగా మీ పై ఉన్న ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు. భూమికి సంబంధించిన అంశముల లో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది.వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. తోబుట్టువులతో నిదానమవసరం. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభం కుటుంబంలోని పెద్దలు, పూర్వ గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు. ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనో ధైర్యము ఇస్తుంది.విద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. విదేశీ ప్రయత్నం చేయు వారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి.అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవి సంతోషాన్ని , ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. మధ్యలో వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది. వృత్తిపరమైన వైరాగ్యంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి. వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



## కుంభ రాశి

ధనిష్ట 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ప్రయాణాలలో అనుకోని ఆటంకములు, చికాకులు, ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు.ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము.నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి. అగ్రిమెంట్లు చేసేటప్పుడు, సంతకాలు చేసుకునేటప్పుడు వీలైనంత జాగ్రత్తలు అవసరం, తోబుట్టువులతో ఆత్మీయులతో చర్చలు జరిపేటప్పుడు విభేదాలు రాకుండా వీలైనంతవరకూ మౌనం పాటించట మేలు. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. వారం మధ్యలో భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసు కుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. పెద్దల ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోజీవిత భాగస్వామితో ఆధ్యాత్మిక సంబంధ ప్రయాణాలు, దేవాలయ సందర్శన,నదీ స్నానాలు మొదలైన వాటి గురించి అనుకూలమైన చర్చలు చేస్తారు . కుటుంబము ఆహ్లాదకరంగా ఉంటుంది కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరోధక శక్తి పెరుగు తాయి. పాత బాకీలు వసూలు అవుతాయి.ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి ఆకస్మిక ఖర్చులు చికాకులు కలిగిస్తాయి. దీర్ఘకాలికి పెట్టుబడులు పైన ఆసక్తి ఉండదు. మాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి.


ఐశ్వర్య రాజేష్